క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా



మృతుడి భార్యకు బీమా తక్షణసాయం అందిస్తున్న దృశ్యం

సబ్బవరం: నారపాడు పంచాయతీ శివారు బలిజపాలేనికి చెందిన రొంగలి సత్తిబాబు (32) మృతి చెందడంతో, వైఎస్సార్ బీమా మంజూరైంది. తక్షణసాయంగా రూ.10 వేలను మృతుడి భార్య రొంగలి లక్ష్మికి సచివాలయ కన్వీనర్ మామిడి కొండాజీ, సర్పంచ్ మామిడి శంకరరావు గురువారం అందజేశారు. సత్తిబాబు రైవాడ జలాశయంలో బోటుపై వెళ్తూ బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో మృతి చెందినట్లు తెలియజేశారు. మిగిలిన బీమా పరిహారం రూ.4.90 లక్షలు మృతుడి భార్య బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో బాటజంగాలపాలెం మాజీ సర్పంచ్ వనం అచ్చెంనాయుడు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు గొర్లి నూకరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, వలంటీర్ తానుబిల్లి కాశీ తదితరులు పాల్గొన్నారు.

పినగాడిలో నేడు రీసర్వే

పెందుర్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేలో భాగంగా శుక్రవారం పినగాడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 92, 210, 142, 54, 60, 59, 58లో సర్వే నిర్వహించనున్నట్లు వీఆర్వో సుబ్బారావు తెలిపారు. సంబంధిత సర్వే నంబర్లలో భూములు కలిగిన రైతులు తగిన రికార్డులతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ ప్రత్యేక సమావేశం నేడు

పరవాడ: వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజేయ్‌రాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు పార్టీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. వాడచీపురుపల్లి దరి దలాయిపాలెం రామచంద్రమ్మ ఆలయ సమీపంలోని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అతిథిగృహంలో నిర్వహించనున్న సమావేశంలో పార్టీ నాయకులు భగవాన్ జయరామ్, పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశానికి వైస్ ఎంపీపీలు, పార్టీ ముఖ్య నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు.

'జగనన్నే మా భవిష్యత్' సంక్షేమ యాత్ర వాయిదా

పరవాడ: మండలంలోని వెన్నలపాలెంలో శుక్రవారం నిర్వహించాల్సిన జగనన్నే మా భవిష్యత్ సంక్షేమ యాత్ర కార్యక్రమం అనివార్య కారణాల వలన వాయిదా పడిందని పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంక్షేమ యాత్రను ఈ నెల 29 తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

శిథిలావస్థలో వంతెన రక్షణ గోడ



శిథిలావస్థకు చేరిన దలాయిపాలెం వంతెన రక్షణ గోడ

పరవాడ: వాడచీపురుపల్లి–కలపాక రహదారిలో దలాయిపాలెం ఉప్పుగల్లీల సమీపంలోని వంతెనపై నిర్మించిన రక్షణ గోడ శిథిలావస్థకు చేరింది. 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన పర్యవేక్షణను గాలికి వదిలేయడంతో అనేక చోట్ల పెచ్చులూడిపోయింది. వంతెనకు ఇరువైపులా ఏర్పాటు చేసిన రక్షణ గోడ ఉప్పు గాలికి పెచ్చులుగా ఊడిపోతోంది. దీంతో ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన రక్షణ గోడలకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మణికుమార్‌కు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగం పరిశోధక విద్యార్థి జె.మణికుమార్‌కు ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో 'ఇంప్లిమెంట్ ఆఫ్ నేచర్ ఇన్‌స్పైర్డ్ ఆప్టిమైజేషన్ అల్గారిథమ్స్ టు ఎంఆర్‌ఐ ఇమేజ్ ఎన్‌హాన్స్‌మెంట్' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను మణికుమార్ గురువారం స్వీకరించారు.

ప్రమాదపుటంచున ప్రయాణం

- వాహనచోదకుల అవస్థలు
- భారీ వాహనాలను తప్పించే క్రమంలో తరచూ ప్రమాదాలు

పరవాడ: మండలంలోని పలు రహదారుల అంచులు ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు హడలిపోతున్నారు. ప్రమాదపుటంచున ప్రయాణం చేస్తున్న పరిస్థితి నెలకొంటోంది. పరవాడ–యలమంచిలి రహదారి, పరవాడ–అనకాపల్లి, పరవాడ–పెదముషిడివాడ రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాలకు రాకపోకలు సాగించే రోడ్డు అంచులు ప్రమాదకరంగా తయారయ్యాయి. గతంలో కురిసిన భారీ వర్షాల నీటి ప్రవాహానికి రోడ్డు పక్కనున్న మట్టి కొట్టుకుపోవడంతో రోడ్డు అంచులు లోతట్టుగా మారాయి.

➡ పరవాడ–యలమంచిలి రహదారిలో పలు చోట్ల రోడ్డు అంచులు లోతట్టుగా మారడంతో, భారీ వాహనాలను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనచోదకులు, సైక్లిస్టులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.

➡ పరవాడ సబ్‌స్టేషన్–సినిమాహాలు కూడలికి మధ్యమార్గంలో రోడ్డు అంచులు మరీ దారుణంగా మారడంతో ఇక్కడా ఇదే పరిస్థితి నెలకొంది.

➡ పరవాడ–అనకాపల్లి రహదారిలో ప్రమాదకరంగా మారిన రోడ్డు అంచుల వల్ల నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది.

➡ పరవాడ శ్మశానం సమీపంలో రోడ్డు అంచులు బాగా లేనందువల్ల గతంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న భర్నికం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడ్డారు.

➡ పరవాడ–పెదముషిడివాడ రహదారి ఎడ్జ్ ప్రమాదకరంగా ఉంది.

➡ గ్రామీణ ప్రాంతంలో వాడచీపురుపల్లి–తంతడి, జాజులవానిపాలెం–పి.బోనంగి, వాడచీపురుపల్లి–కలపాక రహదారుల అంచులు బాగా దెబ్బతినడం వలన ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

➡ ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించాలని, సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



యలమంచిలి రహదారిలో ప్రమాదకరంగా మారిన రోడ్డు అంచు

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- పెదనరవలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం
- 330 మందికి వైద్య సేవలు



పెదనరవలో మందులు అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ప్రజల ఆరోగ్య భద్రత ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 88వ పెదనరవలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉచితంగా వైద్యాన్ని పొందే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ప్రజలకు వైద్య సదుపాయాలు అందుతున్నాయని చెప్పారు. ప్రజలంతా ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 330 మందికి వైద్య సిబ్బంది వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారిని మెరుగైన వైద్యం కోసం రిఫరల్ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అందించేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. జోనల్ కమిషనర్ సింహాచలం, ఈఈ ప్రసాద్‌బాబు, ఏపీడీ రాము, ఏఈ తులసి, సీవో ఈశ్వరి, వార్డు అధ్యక్షుడు గంగ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలకు బహుమతులు అందిస్తున్న సంస్థ అధికారి రాధా మనోహర్, నారాయణరావు

పరవాడ: విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఉక్కునగరం పవర్‌గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పవర్ గ్రిడ్ విద్యుత్ సంస్థ చీఫ్ మేనేజర్ రాధా మనోహర్ గురువారం ప్రారంభించారు. అవినీతి వద్దు అనండి–దేశానికి అంకితం అవ్వండి అనే అంశంపై జరిగిన ఈ పోటీల్లో కళాశాలలోని 11, 12 తరగతుల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలకు 26 మంది విద్యార్థులు హాజరయ్యారు. డి.స్వాతి(ప్రథమ), బూపేంద్రపాల్(ద్వితీయ), ఎస్.పి.ప్రజ్ఞ(తృతీయ), కె.కీర్తన(నాలుగో) బహుమతులు దక్కించుకున్నారు. పవర్‌గ్రిడ్ విద్యుత్ సంస్థ చీఫ్ మేనేజర్ రాధా మనోహర్, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పైల అప్పారావు, అప్రెంటీస్‌లు ఆది, అపర్ణ, కిశోర్ నాయుడు, కళాశాల అధ్యాపక బృందం సభ్యులు పాల్గొన్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్ర నవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతిస్తారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

'ఓపెన్ హౌస్'పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి అక్కయ్యపాలెం జ్ఞాననికేతన్ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.విజయకుమార్ మాట్లాడుతూ స్టూడెంట్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మ్యాప్‌ప్యాక్‌లు ఉపయోగించే తీరు, అత్యవసర సమయంలో పోలీసులు స్పందించే తీరు, కేసుల నమోదు, రిసెప్షన్ తీసుకున్న నిర్ణయాలు, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మాట్లాడే విధానం, ఆయుధాలు ఎప్పుడు ఉపయోగించాలనే విషయాలను తెలియజేశారు. స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సీఐ, ఎస్ఐ, ఏఎస్ఐ, హెచ్‌సీ, పీసీల విధివిధానాలపై వివరించారు. ప్రతి ఒక్క విషయాన్ని విద్యార్థులు ఆసక్తిగా ఆలకించారు. వారితో సీఐ విజయకుమార్ కాసేపు ముచ్చటించారు. 57 మంది కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటరావు, ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధితో చిన్నారి పోరాటం

దాతలు సహకరించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుష్మిక

మర్రిపాలెం: ప్రాణాంతక వ్యాధికి గురై తమ ఆరేళ్ల కుమార్తె కుష్మిక మృత్యువుతో పోరాడుతోందని మురళీనగర్ తెన్నేటినగర్‌కు చెందిన పేద దంపతులు గణేష్, షారా ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి వైద్యానికి సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు గురువారం తెన్నేటినగర్‌లోని జీసస్ వర్డ్ ఆఫ్ లైఫ్ పాస్టర్ అండ్ లీడర్స్ ఫెలోషిప్ కార్యాలయంలో మీడియాతో వారు మాట్లాడారు. తమ కుమార్తె ప్రస్తుతం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని చెప్పారు. వైద్యానికి సుమారు రూ.15 లక్షలు అవసరమవుతుందని డాక్టర్లు తెలియజేశారన్నారు. బంధువుల సహాయంతో ప్రాణాలు కాపాడుకొస్తున్న తమకు దాతలు సహాయం అందించి తమ బిడ్డ ప్రాణాలను కాపాడాలని వేడుకున్నారు. మీడియా ద్వారా దాతల సహాయం కోసం అభ్యర్థించారు. సహాయం చేసే వారు 79818 87454 నంబర్‌లో సంప్రదించాలని కుష్మిక తల్లిదండ్రులు కోరారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పరవాడ: తాడి–దువ్వాడ రైల్వే లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని జీఆర్‌పీ పోలీసులు గురువారం గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. తాంబ్రం–ఖరగ్‌పూర్ రైలులో ప్రయాణించడానికి ఈ నెల 25న ఓ వ్యక్తి టిక్కెట్ తీసుకున్నాడు. రైలు తాడి–దువ్వాడ మధ్య ప్రయాణిస్తున్న సమయంలో సదరు వ్యక్తి రైలు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోయాడని రైల్వే పోలీసులు చెప్పారు. ఈ ప్రమాదం తాడి–దువ్వాడ రైల్వే లైన్‌లో 758/14–16 కిలోమీటరు వద్ద జరిగింది. ప్రమాదంలో మరణించిన వ్యక్తి 45 ఏళ్ల వయస్సు, 5/6 అంగుళాల పొడవు కలిగి నలుపు రంగులో ఉండి పింక్ కలర్ టీషర్టు, ఎల్లో కలర్ బనియన్, నలుపు రంగు ఫుల్‌ప్యాంటు ధరించి ఉన్నాడని, వివరాలు తెలిసిన వారు దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని జీఆర్‌పీ పోలీసులు కోరారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



రైల్వే స్టేషన్‌లో వృద్ధుడి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 8 ట్రాక్‌పై గుర్తు తెలియని ఓ వృద్ధుడు మరణించాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. జీఆర్పీ సిబ్బంది తెలిపి న వివరాలిలా.. సుమారు 60 ఏళ్ల వయసు గల వృద్ధుడు రైల్వే ట్రాక్‌పై మృతి చెందాడు. ఇతడు సుమారు 5.6 అడుగుల ఎత్తు, చామన చాయ శరీర రంగు. లేత పసుపు, తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ చొక్కా, నీలం, తెలుపు రంగు లుంగీ ధరించి ఉన్నాడు. ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ సిబ్బందికి స్వయంగా గానీ 94934 74582, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్ఐ మధుసూదనరావు కోరారు.

షిప్‌యార్డ్‌లో ఎన్నికల సందడి

సింధియా : హిందూస్తాన్ షిప్‌యార్డ్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికల సందడి ప్రారంభమైంది.ఈ మేరకు శుక్రవారం ఓటరు జాబితాను ఎన్నికల రిటైనింగ్ అధికారి ప్రకటించనుండగా, శనివారం ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. నవంబర్ 7న తుది జాబితా ప్రకటించనున్నారు. 8వ తేదీన నామినేషన్లు స్వీకరిస్తారు. 9న నామినేషన్లు ఉపసంహరణతో పాటు ఎన్నికల గుర్తులను ప్రకటించనున్నారు. 18వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుర్తింపు యూనియన్ ఎన్నికలను నిర్వహించి, సాయంత్రం 5 గంటలకు విజేతలను ప్రకటిస్తారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని, రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వయసు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలని, పదో తరగతి పాసైన వారు అర్హులని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్‌ఏసీ శిక్షణ సంస్థలో, 83090 03957లో సంప్రదించాలని కోరారు.

574 మంది అడ్మిన్లకు ఈ-పాస్ మిషన్లు

- వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో నేడు శిక్షణ
- జీవీఎంసీ డీసీఆర్ సత్యనారాయణ

మధురవాడ: జీవీఎంసీలో 574 మంది వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు ఈ–పాస్ మిషన్లు అందజేశామని జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సీహెచ్ సత్యనారాయణ చెప్పారు. జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కార్యాలయంలో వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు గురువారం ఈ – పాస్ మిషన్లు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మిషన్లు ఉపయోగించే విధానం, రెవెన్యూ కలెక్షన్, అడ్మిన్ల బాధ్యతలపై సమీక్ష నిర్వహించారు. మిషన్ల వినియోగంపై మరింత శిక్షణ అవసరమని గుర్తించామని, అందుకే శుక్రవారం నగరంలోని వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో సాయంత్రం 4 గంటలకు శిక్షణ ఇస్తామని చెప్పారు.

రిప్లై ఆధారంగా రమేష్‌పై చర్యలు

జీవీఎంసీ జోన్ – 2లో సెలవులో ఉన్నప్పటికీ ప్రభుత్వ అధికారిక లాగిన్ ఉపయోగించి రెవెన్యూ ఫైల్స్ అప్‌లోడ్ చేసిన ఆర్వో రమేష్‌పై త్వరలో చర్యలు తీసుకుంటామని డీసీఆర్ సత్యనారాయణ తెలిపారు. సాక్షిలో ప్రచురితమైన కథనం ఆధారంగా రమేష్‌కు అధికారులు కొద్ది రోజుల క్రితం మెమో జారీ చేశారని, దీనికి అతని నుంచి రిప్లై వచ్చిందని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్వో ఇలా చేయడానికి కారకులు ఎవరన్న కోణంలోనూ విచారిస్తున్నట్లు డీసీఆర్ చెప్పారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



మాంగల్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



నిత్య కల్యాణం తిలకిస్తున్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. పూజలలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను తీసుకొచ్చి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం జరిపించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

నోబెల్ రికార్డ్ సాధించిన చిన్నారికి అభినందన



ఆర్యన్‌ను అభినందిస్తున్న ముమ్మన దేముడు

పెందుర్తి: పద్నాలుగు నెలల వయసులోనే నోబెల్ వరల్డ్ రికార్డు(ఆన్‌లైన్ ద్వారా జరిగిన పోటీల్లో) సాధించిన చిన్నారి గాబు చార్విక్ ఆర్యన్‌ను కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు 95వ వార్డు పాపయ్యరాజుపాలెంలోని చిన్నారి నివాసానికి గురువారం వెళ్లిన ఆయన జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ అతిపిన్న వయసులోనే వివిధ కేటగిరీల్లో ఆర్యన్ అద్భుత ప్రతిభ కనబరిచాడన్నారు. బాలుడు తల్లిదండ్రులు కల్యాణ్, రాగ ప్రియంక మాట్లాడుతూ ఆర్యన్ జంతువులు, పక్షులు, పువ్వులు, స్వాతంత్ర్య సమరయోధులు, కూరగాయలు, రంగులు, వర్ణమాలలు, సంఖ్యలు, గృహోపకరణలు, బొమ్మలను గుర్తించి జవాబులు చెప్పాడన్నారు. అవి రికార్డు చేసి నోబెల్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఈ నెల 14న ఆర్యన్ రికార్డు సొంతం చేసుకున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారన్నారు.

29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జిల్లా యోగా అసోసియేషన్, ఏయూ యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు–2023 జరగనున్నాయి. ఈ మేరకు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం ఏయూ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎ.రాజు, కార్యదర్శి సిహెచ్.వెంకటరమేష్, కోశాధికారి జి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

8న విద్యా సంస్థల బంద్



వివరాలు వెల్లడిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

అల్లిపురం : విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యా సంస్థలు బంద్ ప్రకటించినట్లు ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ఉల్లం నాగరాజు, కార్యదర్శి వై.రాంబాబు తెలిపారు. సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు నవంబర్ 8వ తేదీకి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థలు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ బందులో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు అచ్యుతరావు, పీడీఎస్ఎఫ్ జిల్లా నాయకురాలు అభిశ్రీ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రతన్‌కాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శేఖర్, జీవన్, మనీ, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమలను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 987వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్–1 విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నేడు కేంద్రప్రభుత్వ పెద్దలు దేశంలోని ప్రజా సమస్యలను వదిలిపెట్టి తమ రాజకీయ అవసరాల కోసమే పాలన సాగిస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీల కుట్ర రాజకీయాలను వ్యతిరేకించాల్సిన ప్రతిపక్ష పార్టీలు వారికి వంతపాడుతున్నాయన్నారు. ప్రజాపోరాటాల ద్వారా జరిగే ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలన్నారు. ఉక్కు పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాలు ప్రారంభం



మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణకుమారి

మద్దిలపాలెం : ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణకుమారి అన్నారు. డోరు డెలివరీ మాసోత్సవాలను గురువారం ఆమె డిపో ఆవరణలో కౌంటర్ వద్ద పోస్టర్ ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సేవలను నగరంలో 10 కిలోమీటర్ల మేరకు అందిస్తామన్నారు. గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాలలో పార్సిళ్లు బుక్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం జి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.